## పొంగలి మొక్కుబడులు సమర్పించిన ధర్మకర్తల మండలి



**విస్సన్నపేట,జూన్ 26 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలోని పుట్రేల శ్రీ మారెమ్మ అమ్మవారి దేవాలయం ప్రాంగణంలో ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠ నిర్వహించిన సందర్భంగా ఆలయ చైర్మన్ తమ కమిటీ ఆధ్వర్యంలో పొంగలి మొక్కుబడి తీర్చుకున్నామని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదివేల మందికి అన్న ప్రసాద వితరణ అందించామని సహకరించిన భక్తులకు గ్రామ పెద్దలకు వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. అన్న ప్రసాద వితరణకు సువిశాలమైన స్థలాన్ని అందించడమే కాకుండా ప్రత్యక్షంగా పాల్గొని పర్యవేక్షించిన మాజీ మారెమ్మ దేవాలయం చైర్మన్ సునీల్ బాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఒకే వేదికపై రెండు పుట్టినరోజులు నిర్వహించిన వైసీపీ పెద్దలు



**విస్సన్నపేట,జూన్ 26 (వార్తాప్రభ) :** స్థానిక మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ప్రాంగణంలో వైసిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మద్దిరెడ్డి సూర్యనారాయణ రెడ్డి, ఎన్టీఆర్ జిల్లా వైసీపీ లీగల్ సెల్ కార్యదర్శి శిరసాని ప్రకాష్ మేనకోడలు బేబీ లక్ష్మీ జన్మదినోత్సవ వేడుకలను వైసీపీ పెద్దలు ఘనంగా నిర్వహించారు.

## గృహప్రవేశ వేడుకలో పాల్గొన్న అతిరథ మహారథులు

**విసన్నపేట,జూన్ 26 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలోని తాతకుంట్ల గ్రామపంచాయతీ మిట్టగూడెం గ్రామంలో ఇంజనీర్ మేడా శ్రీనివాసరావు నిర్మించిన డూప్లెక్స్ హౌస్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా అంతర్జాతీయ మిషనరీ క్రైస్తవ బోధకులు గంటా ఫిలిఫ్ పాల్గొన్నారు. రాజకీయ పార్టీల నాయకులు వ్యాపారస్తులు విద్యాసంస్థల అధినేతలు బ్యాంకాక్ ఇంజనీర్స్ ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

## నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు ఆర్డీవో



**తిరువూరు,జూన్ 26 (వార్తాప్రభ) :** తిరువూరులో దమ్ము చక్రాల ట్రాక్టర్లు, ఓవర్‌లోడ్ ఆటోలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించిన తిరువూరు ఆర్డీవో ఏ.కుమార్ స్కూల్, కాలేజీల సమయానికి దమ్ము ట్రాక్టర్లు, ఓవర్‌లోడ్ వాహనాలతో ట్రాఫిక్ అంతరాయం విద్యార్థులకు అసౌకర్యం ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని ఆర్డీవో హెచ్చరికఆటో డ్రైవర్ సీటు పక్కన ప్రయాణికులను ఎక్కించడం నిషేధమని స్పష్టం చేసిన ఆర్డీవో టూవీలర్లపై ట్రిపుల్ రైడింగ్ చేయరాదని వాహనదారులకు సూచన దమ్ము చక్రాల ట్రాక్టర్లతో రోడ్లు త్వరగా దెబ్బతింటున్నాయని వెల్లడించిన ఆర్డీవో వర్షాకాలంలో రోడ్డుపై అతివేగంతో వెళ్ళరాదని వాహనదారులకు హెచ్చరిక నిబంధనలు అతిక్రమిస్తే వాహనాలు సీజ్ చేసి తగు చర్యలు తీసుకుంటామని ఆర్డీవో ఏ.కుమార్ స్పష్టీకరణ

## శభాష్ బి ఎల్ ఏ తిరువూరు నియోజవర్గ టిడిపి సీనియర్ నాయకులు నెక్కలపు శ్రీనివాసరావు( ఎన్టీవీ ప్రసాద్ )



**విస్సన్నపేట,జూన్ 26 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో టిడిపి అత్యధిక గ్రామ పంచాయతీలు గెలుచుకునేందుకు చురుకైన బిఎల్ఎలు ప్రముఖ పాత్ర పోషిస్తున్నారని కొర్లమండ బూత్ 161 బి ఎల్ ఎ రాజబోయిన ప్రసాద్ ఒకరని తిరువూరు నియోజకవర్గ టిడిపి సీనియర్ నాయకులు నెక్కలపు శ్రీనివాసరావు (ఎన్టీవీ ప్రసాద్) తెలియజేశారు. మండలంలో తెలుగుదేశం పార్టీ అన్ని గ్రామపంచాయతీలు బంపర్ మెజార్టీతో గెలుస్తాయని అన్నారు.

## శ్రీ కొండలమ్మకు లక్ష మల్లెల పూజ...



**గుడ్లవల్లేరు,జూన్ 26 (వార్తాప్రభ) :** మండలంలోని వేమవరం గ్రామములో వేంచేసియున్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానములో లక్ష మల్లెల పూజను శుక్రవారం కనులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేషాభిషేకాలతో ప్రత్యేక పూజలను చేపట్టారు. తొలుత గణపతి పూజ, మండపార్చన అనంతరం లక్ష మల్లెలతో పుష్పార్చన మంత్ర పుష్పం, మణిదీప వర్ణన, భక్తి గీతాలు మరియు లలిత సహస్ర పారాయణం అనంతరం తీర్థప్రసాదాల వినియోగం చేపట్టారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ కార్యదర్శి కొడాలి రామరాజు దంపతులు, దేవస్థాన చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహనరావు దంపతులు, ఈఓ ఆకుల కొండలరావు దంపతులు, ధర్మకర్తల మండలి సభ్యులు కళ్ళేపల్లి సుగుణ శేఖర్, వడ్లమూడి రవీంద్రబాబు, నూతలపాటి లక్ష్మీ పావని, పెన్నేరు నాగ వెంకట లీల శేఖర్ ఈ పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సహకార వ్యవస్థ బలోపేతమే లక్ష్యం : డిసిసిబి చైర్మన్ తుమ్మల బాబు






**కాకినాడ,జూన్ 26 (వార్తాప్రభ) :** రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అని 132వ మహాజన సభలో డీసీసీబీ చైర్మన్, జనసేన పార్టీ అధ్యక్షులు తుమ్మల రామస్వామి బాబు తెలిపారు.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) 132వ మహాజన సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి బాబు సహకార వ్యవస్థ అభివృద్ధి, రైతుల సంక్షేమం, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతంపై విస్తృతంగా మాట్లాడారు.డిసిసిబి సీఈఓ ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన కాకినాడ కుళాయి చెరువు ఫ్యాబిన్ కళ్యాణమండపంలో ఏర్పాటు చేసిన 132 మహాజన సభలో డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి బాబు మాట్లాడుతూ సహకార వ్యవస్థ అనేది కేవలం బ్యాంకింగ్ వ్యవస్థ మాత్రమే కాదని, గ్రామీణ ఆర్థికాభివృద్ధికి, రైతుల భవిష్యత్తుకు బలమైన పునాది అని పేర్కొన్నారు. రైతులకు తక్కువ వడ్డీతో పంట రుణాలు,వ్యవసాయ అనుబంధ రుణాలు, స్వయం ఉపాధి రుణాలు,మహిళా సంఘాలకు ఆర్థిక సహాయం,వ్యవసాయ యాంత్రీకరణకు అవసరమైన ఆర్థిక మద్దతు వంటి అనేక సేవలను సహకార రంగం అందిస్తోందన్నారు.రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను గ్రామీణ స్థాయిలో ప్రతి అర్హుడికి చేరవేయడంలో సహకార సంఘాలు కీలక పాత్ర పోషించాలని ఆయన సూచించారు. రైతులకు సకాలంలో రుణాలు అందించడం, పంటల సాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచడం, వ్యవసాయ ఉత్పత్తుల విలువ పెంచే కార్యక్రమాలకు సహకరించడం వంటి అంశాల్లో సహకార సంఘాలు మరింత చురుకుగా వ్యవహరించాలన్నారు. సహకార బ్యాంకుల ఆర్థిక బలోపేతానికి రుణాల వసూళ్లు అత్యంత కీలకమని పేర్కొన్న తుమ్మల రామస్వామి బాబు, అన్ని పీఏసీఎస్ అధ్యక్షులు, డైరెక్టర్లు, సిబ్బంది సమిష్టిగా కృషి చేసి లోన్ రికవరీ శాతాన్ని పెంచాలని పిలుపునిచ్చారు. రుణాలు తిరిగి చెల్లించినప్పుడే మరింత మంది రైతులకు కొత్త రుణాలు అందించే అవకాశం ఉంటుందని వివరించారు.సహకార సంఘాలు బలపడితే రైతు బలపడతాడు. రైతు బలపడితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది. అందుకే సహకార రంగాన్ని లాభాల బాటలో నడిపించడం మన అందరి బాధ్యత. డీసీసీబీని రాష్ట్రంలోనే ఆదర్శ సహకార బ్యాంకుగా తీర్చిదిద్దేందుకు నా శక్తి మేరకు నిరంతరం కృషి చేస్తానని తుమ్మల రామస్వామి బాబు స్పష్టం చేశారు.అలాగే రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రైతులు, మహిళలు, యువత, పేద కుటుంబాల సంక్షేమం కోసం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు గ్రామీణ ప్రాంతాల్లో సానుకూల మార్పులకు దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాల ప్రయోజనాలను ప్రజలకు చేరవేయడంలో సహకార సంస్థలు వారధిగా నిలవాలని సూచించారు.మహాజన సభలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక నివేదిక, ఆడిట్ నివేదిక, లాభనష్టాల ఖాతాలు, రుణాల వసూళ్లు, ఎన్పీఏల నియంత్రణ, వన్ టైమ్ సెటిల్మెంట్ అంశాలతో పాటు బ్యాంకు భవిష్యత్ కార్యాచరణపై చర్చించి పలు తీర్మానాలను ఆమోదించారు.ఈ కార్యక్రమంలో సీఈవో ప్రవీణ్ కుమార్ డైరెక్టర్లు,సహకార సంఘాల అధ్యక్షులు, ప్రతినిధులు, అధికారులు, సభ్యులు ,పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# మేడలైన్ వంతెన నిర్మాణంపై శ్వేతపత్రం విడుదల చేయాలి: రమణరాజు

- ఆ వంతెన అక్రమ నిర్మాణమా? సక్రమ నిర్మాణమా అనేది తెలియజేయాలి





**కాకినాడ,జూన్ 26 (వార్తాప్రభ) :** కాకినాడ ఉప్పుటేరులో ఇంద్రపాలెం వంతెన సమీపంలో నిర్మాణం పూర్తిచేసుకుని ప్రారంభానికి సిద్ధంగా ఉన్న మేడలైన్ ప్రైవేట్ వంతెన నిర్మాణంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్వేతపత్రం విడుదల చేయాలని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్, సామాజిక వేత్త దూసర్లపూడి రమణరాజు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ రోడ్డులో అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం ఫ్లెక్స్ ప్రదర్శిస్తూ ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ వంతెన నిర్మాణం చట్టబద్ధంగా జరిగిందా, లేక అక్రమంగా చేపట్టారా అనే విషయాన్ని ప్రభుత్వం ప్రజలకు స్పష్టం చేయాలని కోరారు. కేంద్ర జల సంఘం నిబంధనలను ఉల్లంఘించి, గత ప్రభుత్వాల హయాంలో రాజకీయ పలుకుబడితో నిర్మాణం జరిగిందని ఆరోపించారు. భూ రికార్డుల్లో అక్రమ మార్పులు చేసి నిర్మాణానికి సహకరించారని పేర్కొన్నారు. దీనిపై న్యాయ విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని అన్నారు. వంతెన ప్రారంభమైతే ఇప్పటికే తీవ్ర రద్దీ ఉన్న ఆరు రోడ్ల కూడలిలో ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాలు మరింత పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. నగరంలో వరద ముంపు సమస్యలకు కూడా ఈ వంతెన ఒక కారణంగా మారుతుందని ఆరోపించారు. మేడలైన్ ప్రాంతంలోని ప్రభుత్వ భూములను ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించాలని, పేదల గృహాలు, తీరప్రాంత కార్మికుల నివాసాలు, జర్నలిస్టుల కాలనీ వంటి అవసరాలకు కేటాయించాలని సూచించారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ప్రజాప్రతినిధులు ఈ అంశంపై ప్రజలకు వివరణ ఇవ్వాలని, వంతెన నిర్మాణానికి సంబంధించిన పూర్తి వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నూజివీడులో ర్యాలీ, అవగాహన కార్యక్రమం



**నూజివీడు,జూన్ 26 (వార్తాప్రభ) :** ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని నూజివీడు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గురువారం మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ప్రజలు మాదక ద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. నూజివీడు పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగిన ర్యాలీలో మాదక ద్రవ్యాల వల్ల వ్యక్తిగత, కుటుంబ, సామాజిక జీవితాలపై కలిగే ప్రతికూల ప్రభావాలను వివరిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో అధికారులు మాట్లాడుతూ, మాదక ద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును తీవ్రంగా దెబ్బతీస్తుందని, వాటికి బానిస కాకుండా విద్య, క్రీడలు, సృజనాత్మక కార్యక్రమాలపై దృష్టి సారించాలని సూచించారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయం, వినియోగాన్ని అరికట్టేందుకు ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించి, అనుమానాస్పద సమాచారం ఉంటే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని కోరారు. ఈ సందర్భంగా పాల్గొన్న వారందరూ "మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటాం -- ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేస్తాం" అనే ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీ ఎ. మస్తానయ్య, ఏలూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ శ్రీ పి.ఎస్.డి. భోగేశ్వరరావు, శాఖ సిబ్బంది మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండే సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని అధికారులు పిలుపునిచ్చారు.

## సెంటిమెంటుకు శ్రీకారం చుట్టిన మండల వైసిపి బిఎల్ఎ ఇంచార్జ్



**విస్సన్నపేట,జూన్ 26 (వార్తాప్రభ) :** వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుండి తిరువూరు నియోజకవర్గం ఈశాన్య దిక్కు ప్రాంతమైన కొండ పర్వ గ్రామపంచాయతీ నుండి శ్రీకారం చుట్టడం ఆనవాయితీగా వస్తుందని మాజీ గ్రామ సర్పంచ్ వైసీపీ గ్రామ పార్టీ అధ్యక్షులు గొట్టిపూళ్ళ రమేష్ బాబు మీడియా సమావేశంలో తెలియజేశారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలలో జరుగుతున్న ఎస్ ఐ ఆర్ కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్క ఓటును ఒడిసి పట్టుకోవాలని గతంలో కన్నా మండలంలో ప్రతి ఒక్క గ్రామ పంచాయతీలో కూడా అత్యధిక మెజార్టీ సాధించేందుకు ప్రతి ఒక్క బూత్ లెవెల్ ఏజెంట్ కృషి చేయాలని మండల బిఎల్ఎ ఇంచార్జ్ కే తిరుపతిరావు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సహకార సంఘ అధ్యక్షులు జి చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ గాజుల శ్రీనివాసరావు, మండల ఎస్సీ సెల్ ఇంచార్జ్ మంగయ్య,189, 190,191 బూత్ లెవెల్ ఏజెంట్లు పాల్గొన్నారు.

## నేటి వేంకటేశ్వరుని దర్శనానికి భక్తులకు ముమ్మర ఏర్పాట్లు...



**గుడ్లవల్లేరు,జూన్ 26 (వార్తాప్రభ) :** మండలంలోని డోకిపర్రు మహాక్షేత్రంలోని భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో స్వామివారిని శనివారం దర్శించుకోనున్న భక్తకోటికి శుక్రవారం ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(మెయిల్) అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వేంకట కష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో స్వామివారికి జరిగే ప్రత్యేక పూజలు, విశేషాభిషేకాలతో పాటు బేడీ ఆంజనేయ స్వామివారి వార్షికోత్సవాలను నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు కె.బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ దంపతులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే వేలాది భక్తులు విచ్చేస్తున్న ఈ ఆలయంలో ఎండలో భక్తులెవరూ ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండేందుకు చలువ పందిళ్లతో పాటు మంచినీరు, అన్నసమారాధన ఏర్పాట్లను బాపిరెడ్డి, భాస్కరమ్మ దంపతులు పర్యవేక్షిస్తున్నారు.

## కాగిత పుట్టినరోజు వేడుకలు సందర్భంగా నోట్ బుక్స్ పంపిణీ



**కృత్తివెన్ను,జూన్ 26 (వార్తాప్రభ) :** కృత్తివెన్ను మండలం శీతనపల్లి పంచాయితీ శీతనపల్లి సలోబి వద్ద గల భానోదయ పబ్లిక్ స్కూల్ ఆవరణ వద్ద శుక్రవారం గ పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ పుట్టిన రోజు వేడుకలు సందర్భముగా ముందుగా కేక్ కట్చేసి ఆయనకు శుభాకాక్షలు తెలిపిన కూటమి నాయకులు మరియు కృత్తివెన్ను బంటుమిల్లి ముదినేపల్లి మండలాలు ఏకల్ అభియాన్ టీచర్లు తదుపరి వాళ్ళ స్టూడెంట్స్ అందజేయమని నోట్ బుక్స్ మరియు పెన్నులు పంపిణీ చేయటం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కూటమి నాయకులు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు పిన్నెంటి రత్తయ్య భస్వాని నీలాజలం పాశం శ్రీనివాసరావు తోట కిషోర్ పాల్గొని 30 మంది కి ఉపాధ్యాయులు ద్వరా స్టూడెంట్స్ కి పుస్తకాలు పెన్నులు పంపిణీ చేయటం జరిగింది

## ప్రజల ఆరోగ్యం భద్రత ముఖ్యం ఎమ్మెల్యే



**తిరువూరు,జూన్ 26 (వార్తాప్రభ) :** పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన తాగు నీటిని అందించాలనే లక్ష్యంతో, ఇబ్రహీంపట్నం నుంచి తిరువూరుకు కృష్ణా జలాలను అందించే (240కోట్ల)తో తాగునీటి ప్రాజెక్టులో భాగంగా సుమారు రూ.6 కోట్ల వ్యయంతో నడిం తిరువూరు, రాజుపేట, పి.టి. కొత్తూరు ప్రాంతాల్లో మూడు ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకుల నిర్మాణం చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తెలిపారు.ఈ సందర్భంగా సర్వే నెం. 205/1లో ప్రతిపాదిత స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించి, పట్టణ ప్రజల భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని ట్యాంకుల నిర్మాణానికి అనువైన స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. పనులు నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ ప్రాజెక్టు ద్వారా పట్టణంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మనోజ, టీపీవోనాగమల్లేశ్వరరావు , ఏఈ లోకేష్ , ముత్యాల మధు మరియు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

## సినీ గేయ రచయిత , కవి , జొన్నవిత్తులకు జలధీశ్వరాలయ కమిటీ సత్కారం..



**ఘంటసాల/అవనిగడ్డ,జూన్ 26 (వార్తాప్రభ) :** ప్రముఖ సినీ గేయ రచయిత, సుప్రసిద్ధ తెలుగు కవి జొన్నవిత్తుల రామలింగశాస్త్రి శుక్రవారం ఘన సత్కారం అందుకున్నారు. "దివి వైభవం" పేరుతో దివి సీమ శతకం రచించి దివిసీమ ఖ్యాతిని విశ్వవ్యాప్తి చేయటంతో పాటు, తద్వారా ఘంటసాల జలధీశ్వరాలయ చరిత్ర విశ్వరంజకం చేసిన జొన్నవిత్తుల వారికి మండల పరిధిలోని తాడేపల్లి మలయాళ స్వామి ఆశ్రమంలో ఘంటసాల శ్రీ జలధీశ్వర స్వామి దేవాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ మూల్పూరి వెంకటరావు - సావిత్రి దంపతులు, మలయాళ పీఠాధిపతి పరిపూర్ణానంద స్వామి, జిల్లా పరిషత్ మాజీ వైస్ ఛైర్మెన్ గొర్రెపాటి వెంకట రామకృష్ణ, అసంగానంద గిరిస్వామి, ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, ఆధ్యాత్మిక గురువు విజ్ఞాన స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.



పెడన నియోజకవర్గం శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సీనియర్ జర్నలిస్ట్, ఏ.పి.ఏం.పి. ఏ.జిల్లా నాయకులు లక్కిశెట్టి వెంకట ప్రసాద్

**–పెడన,జూన్ 26 (వార్తాప్రభ) :**

# సంపాదకీయం

## బాబు పవన్ జగన్... దాని కోసమే సెర్చింగ్ !

ఏపీలో ప్రతీ ఎన్నికలోనూ ఒక బలమైన నినాదం ఉంటూ వచ్చింది. అలా వరుసగా మూడు ఎన్నికలు ఇప్పటికి జరిగాయి. ఈ నినాదాలు శక్తివంతమైన సెంటిమెంట్ గా మారి ఆయా పార్టీలకు రాజకీయ లబ్దిని చేకూర్చాయి. 2014లో చూస్తే అపుడే తెలంగాణా నుంచి వేరుపడిపోయి రాజధాని కూడా లేని రాష్ట్రంగా ఏపీ ఉంది. తల లేని మొండెంతో ఉన్న ఏపీని తాము అభివృద్ధి చేస్తామని అటు చంద్రబాబు ఇటు జగన్ జనం ముందుకు వచ్చారు. కేంద్రం సహకారంతో ఏపీలో అద్భుతమైన రాజధానిని నిర్మిస్తామని చంద్రబాబు ఇచ్చిన హామీని జనాలు నమ్మి ఓటేశారు. అలా టీడీపీ అధికారం చేపట్టింది.ఇక 2019లో జగన్ అయితే సంక్షేమ నినాదమే బలంగా జనంలో వినిపించారు. నవరత్నాలు అని ఆయన తీసుకొచ్చిన మినీ మేనిఫెస్టో అయితే జనంలో చర్చకు తావిచ్చింది. అప్పటికి అయిదేళ్ళు అభివృద్ధి మీద టీడీపీ ప్రభుత్వం పూర్తిగా ఫోకస్ పెట్టడంతో సంక్షేమం కోసం చూస్తున్న జనాల నాడిని జగన్ కరెక్ట్ గా పట్టుకున్నారు. అందుకే ఆయన కొత్త పథకాలతో ఆకట్టుకుని ఏపీలో 151 సీట్లతో ముఖ్యమంత్రి అయిపోయారు. ఇక 2024 ఎన్నికల నాటికి కూటమిగా టీడీపీ బీజేపీ జనసేన ఏర్పడ్డాయి. ఈ పార్టీలు అన్నీ కలసి అభివృద్ధితో పాటు సంక్షేమ కూడా మిక్స్ చేసి మరీ జనం వద్దకు వెళ్లారు. ఈ విధంగా చూస్తే 2024 ఎన్నికల్లో కూటమిని సూపర్ సిక్స్ హామీలు ప్లస్ డెవలప్మెంట్ నినాదం కలిపి గెలిపించాయని చెప్పక తప్పదు. అంతే కాదు కనీ వినీ ఎరగని విధంగా ఘన విజయం కూటమిని దక్కింది. 164 సీట్లు సాధించి అసెంబ్లీ అంతా కూటమి పార్టీలు పరచుకున్నాయి. ఇక చూస్తే అమరావతి నినాదం 2024లో బాగా పనిచేసింది. 2029 నాటికి అమరావతి ఒక కొలిక్కి వస్తున్నందువల్ల ఆ నినాదం అంతగా అక్కరకు వచ్చే సీన్ కనిపించడంలేదు. హామీలు కూడా సూపర్ సిక్స్తో ఇచ్చినందువల్ల కొత్త హామీలు ఏమిటి అన్నది కూటమి నేతలు చూడాల్సి ఉంటుందని అంటున్నారు ఇదిలా ఉంటే విపక్షంలో ఉన్న వైసీపీకి కూడా పవర్ ఫుల్ స్లోగన్స్ అవసరం అని అంటున్నారు. మరో ఏడాదిలో జగన్ పాదయాత్ర పేరుతో జనంలోకి వెళ్లబోతున్నారు. జగన్ కనుక పాదయాత్ర చేపడితే స్థానికంగా సమస్యల మీద మాట్లాడడంతో పాటు మొత్తం పాదయాత్ర అంతటా ఏపీని టోటల్ గా ఆకట్టుకునే విధంగా సెంటిమెంట్ ని టచ్ చేసే విధంగా గట్టి నినాదం ఉండాలని అంటున్నారు. వైసీపీ అధినాయకత్వం దాని కోసమే ప్రస్తుతం అన్వేషిస్తోంది అని అంటున్నారు. ఎన్నికల్లో కోట్లాది మంది జనాలను ఒకేత్రాటి పైకి తెచ్చి తమ వైపు తిప్పుకోవాలీ అంటే రాజకీయ పార్టీలకు సమర్ధవంతమైన నినాదం ఉండాలని అంటున్నారు. విమర్శలు ప్రతి విమర్శల వల్ల పని కాదని కూడా విశ్లేషిస్తున్నారు. అవి టైం పాస్ కి మాత్రమే సరిపోతాయని చెబుతున్నారు. జనాలు కూడా సోషల్ మీడియా యుగంలో అన్నీ ఆలోచిస్తారని పైగా జెన్ జీ తరం కూడా ఎదురుగా నిలిచి ఉందని ఈ క్రమంలో ఎన్నికల్లో జనాల మనసు గెలుచుకోవాలంటే ప్రతీ ఎన్నికకూ ఒక పెను సవాల్ గా మారుతోందని అంటున్నారు. మొత్తానికి అయితే బాబు జగన్ పవన్ కూడా నినాదాల కోసం సెర్చ్ చేయాల్సిన అవసరం ఉందని అంటున్నారు.

# దీర్ఘకాల నొప్పులకు నర్వ్ బ్లాక్ చికిత్సలే మేలు

**డాక్టర్ ఎం. హెమజ, పెయిన్ చికిత్స నిపుణురాలు**



**గుంటూరు టౌన్ జూన్ 26 :(వార్తా ప్రభ ప్రతినిధి)**దీర్ఘకాల నడుమునొప్పి, భుజాల నొప్పులు, మోకాళ్ళ నొప్పులతో పాటు ట్రైజెమినల్, గ్లాసోఫేరింజయల్ వంటి కేంద్ర నాడులు వ్యాధిగ్రస్తమై కలగజేసే నొప్పులకు ఆయా నాడులను వివిధ రకాల ఇంజక్టబుల్ మందుల ద్వారా బ్లాక్ చేయడం ద్వారా తీవ్ర నొప్పుల నుంచి చాలావరకుఉపశమనం దీర్ఘకాలం పాటు పొందవచ్చునని హెచ్ పి పెయిన్ క్లినిక్ నిర్వహకురాలు, పెయిన్ చికిత్సలో ప్రత్యేక శిక్షణ పొందిన డాక్టర్ ఎం హెమజ అన్నారు .గురువారం సాయంత్రం స్థానిక జీఎంఏ హాల్లో ఐఎంఏ గుంటూరు శాఖ, పెయిన్ చికిత్సలో అత్యాధునిక విధానాలు అనే అంశంపై నిర్వహించిన నిరంతర వైద్య విద్యా కార్యక్రమం (సిఎంఈ) లో డాక్టర్ హెమజ పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి ఐఎంఏ గుంటూరు శాఖ అధ్యక్షులు డాక్టర్ టి సేవ కుమార్ అధ్యక్షత వహించారు. డాక్టర్ హెమజ ప్రసంగాన్ని కొనసాగిస్తూ శరీరంలో ఏ భాగంలో నొప్పి అనిపించిన అన్ని నొప్పులకు కారణం అవుతున్న నాడులను ఆయా భాగాలలో బ్లాక్ చేయడం ద్వారా నొప్పుల నుండి ఉపశమనం పొందవచ్చునన్నారు. కొన్ని సందర్భాలలో, కొందరిలో కేంద్రీయ నాడులను, గ్యాంగ్లీ యాన్ లను రేడియో ఫ్రీక్వెన్సీ అబ్లేషన్ కు గురి చేయడం ద్వారా ఉత్తమ ఫలితాలు వస్తాయన్నారు .మోకాళ్ళ నొప్పులకు, భుజాల నొప్పులకు ప్లేట్లెట్ రిచ్ ప్లాస్మా (పి ఆర్ పి) చికిత్స మంచి ఫలితాలను ఇస్తుందన్నారు. ఈ ఆధునిక చికిత్స విధానాలు నొప్పుల మందుల వినియోగాన్ని ,వాటి దుష్ఫలితాలను నిరోధించడంలో ఎంతగానో సహాయపడతాయన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ రేడియాలజిస్ట్ కె.వి. పవన్ కుమార్ మాట్లాడుతూ నొప్పులకు కారణమవుతున్న శరీరంలోని ఆయా నాడుల భాగాలను ,వాటి గ్యాంగ్లియాన్ లను కచ్చితంగా గుర్తించి ,చికిత్స చేయడంలో అల్ట్రాసౌండ్ ,సిటీ స్కాన్, ఎమ్మారై స్కానింగ్ లు ఎంతగానో దోహదపడుతున్నాయ న్నారు .స్కానింగ్ ల ద్వారా పిన్ పాయింట్ వ్యాధి నిర్ధారణ, చికిత్స సాధ్యమవుతుందన్నారు. పెయిన్ కు అత్యాధునిక చికిత్స లు చేసే వైద్యులు రేడియాలజిస్ట్ సహకారం తీసుకుంటే ఖచ్చితమైన చికిత్స చేయగలుగుతారన్నారు. సభాధ్యక్షులు ,ఐఎంఏ గుంటూరు శాఖ అధ్యక్షులు డాక్టర్ టి. సేవకుమార్ మాట్లాడుతూ నేటి యువతరం చాలా పెయిన్ సెన్సిటివ్ గా పెరుగుతోందన్నారు. చిన్న నొప్పిని కూడా తట్టుకోలేక పెయిన్ కిల్లర్స్ వినియోగించడం జరుగుతోందన్నారు .దీర్ఘకాల పెయిన్ కిల్లర్స్ వాడటం వల్ల జీర్ణశయ సమస్యలు, మూత్రపిండాలు ,కాలేయ సంబంధ సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. దీర్ఘకాల మెడ నొప్పి, భుజాల నొప్పులు ,నడుం నొప్పులు, మోకాళ్ళ నొప్పులకు ఎక్కువ మంది నొప్పిని తట్టుకోలేక ఉపశమనానికి పెయిన్ కిల్లర్స్ పై ఆధారపడటం జరుగుతోందన్నారు .వీరిలో చాలామంది పెయిన్ కిల్లర్స్ ప్రమాదకర సైడ్ ఎఫెక్ట్స్ ను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. సాధ్యమైనంత వరకు పెయిన్ కిల్లర్స్ వినియోగాన్ని తగ్గించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు . వైద్యుని సలహా లేకుండా పెయిన్ కిల్లర్స్ వాడటం ఎంత మాత్రం మంచిది కాదన్నారు. సభలో పాల్గొన్న ఐఎంఏ గుంటూరు శాఖ కార్యదర్శి డాక్టర్ బి .సాయికృష్ణ మాట్లాడుతూ క్యాన్సర్ బాధితులు నొప్పిని భరించటం చాలా కష్టంగా ఉంటుందని ,వారు భవిష్యత్తు ఆరోగ్యం గురించి ఆలోచించకుండా తాత్కాలిక ఉపశమనానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారన్నారు. అలాంటివారికి నర్వ్ బ్లాక్, రేడియో ఫ్రీక్వెన్సీ అబ్లేషన్ వంటి చికిత్స విధానాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమం అనంతరం పలువురు వైద్యులు వ్యక్తపరచిన సందేహాలను డాక్టర్ ఎం హెమజ ,డాక్టర్ కె.వి. పవన్ కుమార్ నివృత్తి చేశారు .కార్యక్రమంలో ఐఎంఏ గుంటూరు శాఖ ఉపాధ్యక్షులు డాక్టర్ మోపర్తి శివప్రసాద్ ,సీనియర్ వైద్యులు డాక్టర్ కే. రామలింగేశ్వర రావు, డాక్టర్ సిహెచ్ విశ్వేశ్వరరావు, డాక్టర్ జి బాబురావు, డాక్టర్ జి.వేణుగోపాల్ ,గుంటూరు నగరంలోని అన్ని విభాగాల వైద్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## డాక్టర్ ఆకుల రాజ్ కుమార్ స్మారకార్థం చిగురు ఆశ్రమంలో నిత్యావసర వస్తువుల అందజేత



**విజయవాడ పశ్చిమ జూన్ 26 :(వార్తా ప్రభ ప్రతినిధి)**దివంగత డాక్టర్ ఆకుల రాజ్ కుమార్ స్మారకార్థం వారి కుటుంబ సభ్యులు చిగురు ఆశ్రమంలోని 200 మంది నిరాశ్రయులైన పిల్లలకు నిత్యావసర వస్తువులను అందజేశారు.ఈ సందర్భంగా ఆకుల శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ సమాజంలో నిరాదరణకు గురవుతున్న పిల్లలకు అండగా నిలవడం తమ బాధ్యతని, డాక్టర్ రాజ్ కుమార్ సేవా దృక్పథాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. స్వర్గీయ డాక్టర్ రాజకుమార్ తన జీవితకాలంలో అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించారని తెలిపారు. ఈ సేవా కార్యక్రమంలో భాగంగా పిల్లలకు అవసరమైన దుస్తులు, కొబ్బరి నూనె, బిస్కెట్లు, వాషింగ్ సోపులు, స్నానపు సోపులు,

**ఆడపిల్లలకు అవసరమైన నిత్యవసర వస్తువులు** మొదలగునవి పంపిణీ చేశారు. అభాగ్యులకు తమ వంతు సహాయం అందించడం పట్ల ఆశ్రమం నిర్వాహకులు ఆకుల శ్రీనివాస్ కుమార్, వారి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆకుల కుటుంబ సభ్యులు, ఆశ్రమ ప్రతినిధులు , స్థానికులు పాల్గొన్నారు.

# సత్యం,ధర్మం,త్యాగానికి నిలువెత్తు రూపం మొహరం - వెలంపల్లి

- **నియోజకవర్గంలో షర్బత్ పంపిణీ చేసిన మాజీ మంత్రి వెలంపల్లి**
- **మైనారిటీల సంక్షేమానికి, హక్కుల రక్షణకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది - వెలంపల్లి**





**విజయవాడ పశ్చిమ జూన్ 26 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మొహరం (పీర్ల పండుగ) పర్వదినాన్ని పురస్కరించుకుని విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని ముస్లిం సోదర సోదరీమణులందరికీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పవిత్రమైన రోజున నియోజకవర్గ పరిధిలో స్థానిక వించిపేట మహబూబ్ సుభాని జండా చెట్టు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జెడ్ ఎస్ బాషి ఆధ్వర్యంలో ముస్లిం సోదరుల కోసం ప్రత్యేకంగా షర్బత్ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని మైనారిటీ సోదరులకు షర్బత్ పంపిణీ చేసారు.ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ మొహరం అనేది కేవలం ఒక పండుగ మాత్రమే కాదని,అది సత్యం,ధర్మం మరియు త్యాగానికి నిలువెత్తు రూపమని కొనియాడారు.అన్యాయంపై న్యాయం సాధించిన విజయానికి,ప్రవక్త మనవడు హజ్రత్ ఇమామ్ హుస్సేన్ గారు చేసిన మహోన్నత త్యాగానికి ఈ మొహరం చిహ్నమని పేర్కొన్నారు.ఆయన చూపిన త్యాగనిరతి,శాంతి మార్గం నేటి సమాజానికి ఎంతో ఆదర్శప్రాయమని తెలిపారు.పశ్చిమ నియోజకవర్గంలో హిందూ-ముస్లిం భాయ్-భాయ్ అంటూ అందరూ కలిసిమెలిసి ఈ పండుగను జరుపుకోవడం ఇక్కడి గంగా-జమునా తెహజీబ్ (మతసామరస్య సంస్కృతి)కి అద్దం పడుతోందని హర్షం వ్యక్తం చేశారు.ప్రస్తుత ఎండ తీవ్రతలో ఉన్న ప్రజలకు ఈ చల్లని షర్బత్ ఎలా ఉపశమనాన్ని ఇస్తుందో అలాగే మన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మరియు మన ప్రియతమ నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వం ఎల్లప్పుడూ మైనారిటీల జీవితాల్లో చల్లదనాన్ని, భరోసాను నింపుతుందని ఈ సందర్భంగా గుర్తుచేశారు.జగనన్న ప్రభుత్వ హయాంలో మైనారిటీల సంక్షేమానికి,వారి హక్కుల రక్షణకు,ఆర్థిక అభ్యున్నతికి ఎంతగానో ప్రాధాన్యత ఇచ్చామని స్పష్టం చేశారు.భవిష్యత్తులో కూడా పశ్చిమ నియోజకవర్గ ముస్లిం సోదరులందరికీ,వారి పండుగలకు,వారి సర్వతోముఖాభివృద్ధికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని,వారి హక్కుల కోసం నిరంతరం పోరాడుతుందని ఈ సందర్భంగా మనస్ఫూర్తిగా మాట ఇచ్చారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైఎస్సార్సీపీ ముఖ్య నాయకులు,డివిజన్ ఇంచార్జ్లు,అనుబంధ విభాగాల ప్రతినిధులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇంద్రకీలాద్రిపై భక్తుల జాతర

**భారీగా తరలివచ్చిన భక్తజనం**





**విజయవాడ పశ్చిమ జూన్ 26 :(వార్తా ప్రభ ప్రతినిధి)** శుక్రవారం ప్రభుత్వ సెలవు దినం కావడంతో విజయవాడ ఇంద్రకీలాద్రిపై వేంచేసియున్న శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వారి దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచే క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి.

**అంతరాలయ దర్శనం నిలిపివేత** భక్తుల రద్దీ విపరీతంగా పెరగడంతో అందరికీ త్వరితగతిన దర్శనం కల్పించేందుకు ఆలయ అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 2:30 గంటల వరకు అంతరాలయ దర్శనంతో పాటు వి.ఐ.పి దర్శనాలను పూర్తిగా నిలిపివేశారు. కేవలం సర్వదర్శనం లైన్ల ద్వారానే భక్తులను అనుమతించారు.

**భక్తులకు విస్తృత సదుపాయాలు**ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని క్యూలైన్లలో ఉన్న భక్తుల కోసం మొబైల్ టిన్ల (చలన పాత్రల) ద్వారా చల్లని తాగునీటిని నిరంతరాయంగా పంపిణీ చేశారు. అలాగే ఆలయానికి వచ్చిన భక్తులందరికీ సరిపడా ఉచిత ప్రసాదం, నిత్యాన్నదాన వితరణను విస్తృతంగా ఏర్పాటు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు, సిబ్బంది నిరంతరం పర్యవేక్షించారు.

## ఎన్డీయే కార్యాలయంలో ప్రజా దర్బార్ కు విశేష స్పందన




**విజయవాడ పశ్చిమ జూన్ 26 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆదేశాలతో భవానిపురం ఎన్డీయే కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్ కు విశేష స్పందన లభించింది.ఈ కార్యక్రమానికి పశ్చిమ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలు, వినతులను ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రధానంగా తాగునీరు, పారిశుధ్యం, రోడ్లు, పింఛన్లు, కొత్త ఇంటి కోసం దరఖాస్తులు ,వైద్య సహాయం వంటి సమస్యలపై వినతులు సమర్పించారు.ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ కూటమి నేతలతో కలిసి వినతులు స్వీకరించి వాటి పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడారు.ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ప్రజా దర్బార్ ద్వారా నేరుగా ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని కూటమి నేతలు తెలిపారు..మైనారిటీ నాయకులు,మాజీ కార్పొరేటర్ మహ్మద్ అబ్దుల్ ఖాదర్,కూటమి నేతలు కామ దేవరాజ్,దాడి అప్పారావు, కొప్పుల గంగాధర్, రెడ్డిపల్లి గంగాధర్, తారిఖ్ అజీజ్, బొల్లేపల్లి కోటేశ్వరరావు, విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు...

# ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే పాటించాలి



**విజయవాడ పశ్చిమ జూన్ 26 :(వార్తా ప్రభ ప్రతినిధి)**నగరంలో పెరుగుతున్న దోమల సమస్యను నియంత్రించేందుకు ప్రతి ఇంట్లో ఫ్రైడేను, డ్రై డే గా పాటించాలని విజయవాడ నగరపాలక సంస్థ బయాలజిస్ట్ సూర్యకుమార్ నాయక్ అన్నారు. శుక్రవారం ఉదయం కృష్ణలంక పరిసర ప్రాంతాలలో లో ఫ్రైడే డ్రై డే కార్యక్రమం నిర్వహించి ఆ ప్రాంతంలో గల ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా బయాలజిస్ట్ సూర్యకుమార్ నాయక్ మాట్లాడుతూ నగరంలో దోమల సమస్యలను నియంత్రించేందుకు విజయవాడ నగరపాలక సంస్థ విస్తృతమైన చర్యలు తీసుకుంటుందని అందులో భాగంగా నగరంలో ఉన్న కాలువల్లో పూడికలు తొలగించి నీటి ప్రవాహం ఎక్కడ ఆగకుండా చూసుకుంటున్నారని, ట్రాక్టర్ మెషిన్ తో బోట్ల సహాయంతో సిబ్బంది కాలువల్లో పర్యటించి గుర్రపుడెక్కలను, వ్యర్ధాలను తొలగిస్తున్నారని, సిబ్బంది వెళ్లలేని చోట డ్రోన్ ని పంపించి ఎంఎల్ ఆయిల్స్ స్ప్రే చేసి దోమల లార్వా ఉత్పన్నమవుకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.మరోవైపు నగర పరిధిలో ఫాగింగ్, స్ప్రేయింగ్, మరి కొన్నిచోట్ల దోమల లార్వాని తినే గంబోజియా చాపలను విడుదల చేస్తూ నగరంలో దోమల నియంత్రణకు విస్తృతమైన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఒకవైపు విజయవాడ నగరపాలక సంస్థ చర్యలు తీసుకుంటున్నప్పటికీ ప్రతి ఇంట్లో దోమలు ఉత్పన్నం అవ్వకుండా డ్రైడే పాటించాలని అది ప్రతి శుక్రవారం పాటిస్తే ప్రతి ఇంట్లో దోమల సమస్యలు ఉండవని అన్నారు.ప్రతి శుక్రవారం తమ ఇంట్లో మరియు ఇంటి చుట్టు పరిసరాలలో ఎక్కడ నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, ముఖ్యంగా తొట్లు, వాడుక లేని బకెట్లు, మగ్గులు, డ్రమ్ములు, పూల కుండీలు, అలా ఏ వస్తువు అయినా వాడుకంలో లేనివి అందులో నీటి నిల్వ ఉండే అవకాశం ఉన్నవి, ప్రతి శుక్రవారం వాటిని గమనించి ఆ నిల్వ ఉన్న నీరుని పారవేస్తే ఇంట్లో దోమల సమస్య తగ్గుతుందని అన్నారు. అజిత్ సింగ్ నగర్ ప్రాంతంలో ఉన్న ప్రజలకు వారి ఇంటి వద్దకు వెళ్లి నీటి నిల్వలు ఎక్కువగా ఉండే అవకాశం ఎక్కడ ఉన్నాయని చూపించి, వాటిని పారేస్తే అందులో లార్వా చచ్చిపోతుందని వారికి అవగాహన కల్పించి ప్రతి శుక్రవారం దీన్ని పాటిస్తే దోమలను శాశ్వతంగా నియంత్రించవచ్చని వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బయాలజిస్ట్ తో పాటు శానిటరీ ఇన్స్పెక్టర్లు మరియు మలేరియా సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## మృతుని భౌతిక పార్థివదేహానికి నివాళులు అర్పించిన అనగాని రవి పడమట సురేష్



**గన్నవరం..జూన్ 26 :(వార్తా ప్రభ ప్రతినిధి)** 26:..మండల పరిధిలోని బి బిగూడెంగ్రామంలో కాట్రు సుందర్ రావు భౌతిక పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించిన ఎంపీపీ అనగానే రవి, వైఎస్ఆర్సిపి మండల పార్టీ అధ్యక్షులు పడమట సురేష్, గ్రామ పార్టీ నాయకులు తమ్మిశెట్టి రఘుబాబు కాట్రు ధర్మారావు, కాంద్రు మోహన్ రావు, అనంతరం వారు మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాలలో ఎన్నో సంవత్సరాలుగా ప్రజలలో మెలుగుతూ సపరిచితుడుగా మల్లెపూలు అంటూ సైకిల్ పై వ్యాపారం చేస్తూ జీవనం సాగించేవాడని అన్నారు. ఈ కార్యక్రమంలోగ్రామ ప్రజలు ఘన నివాళులు అర్పించినారు.

## రొట్టెల పండుగకు వచ్చే యాత్రికులు సహకరించాలి

**సంగం జూన్ 26(వార్తాప్రభ ప్రతినిధి)** నెల్లూరు బారాషహీద్ దర్గా రొట్టెల పండుగ నేపథ్యంలో సంగం బ్యారేజి వద్ద సీఐ శ్రీనివాస రెడ్డి ఎస్సై భోజ్యా నాయక్ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రొట్టెల పండుగ నుంచి తిరుగు ప్రయాణంలో సంగం బ్యారేజి వద్దకు అధిక సంఖ్యలో యాత్రికులు వస్తుండటంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. బ్యారేజి పరిసరాల్లో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేశారు. రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల సమన్వయంతో ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. భక్తులు, సందర్శకులు ఎట్టి పరిస్థితుల్లోనూ బ్యారేజి నీటిలోకి దిగవద్దని పోలీసులు స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. ప్రమాదాలు నివారించేందుకు బ్యారేజి పరిసరాల్లో నిరంతర నిఘా కొనసాగిస్తున్నారు.రొట్టెల పండుగకు వచ్చే భక్తులు పోలీసుల సూచనలు హెచ్చరిక బోర్డులను తప్పనిసరిగా పాటించాలని కోరారు.ప్రమాదకర ప్రాంతాల్లోకి వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని, ప్రజల ప్రాణ భద్రతే ప్రధాన లక్ష్యంగా పోలీసులు అన్ని ముందస్తు చర్యలు చేపట్టారని తెలిపారు. భక్తులు, సందర్శకులు పోలీసు సిబ్బందికి పూర్తిగా సహకరించి సురక్షితంగా ప్రయాణం కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు.



# మదర్ తెరిసా సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల పంపిణీ






**గన్నవరం :జూన్ 26 :(వార్తా ప్రభ ప్రతినిధి)** పేదలకు తోచిన సాయం చేయటం ప్రతి ఒక్కరి భాధ్యతని, అది మానవతా దృక్పదాన్ని తెలియజేస్తుందని సర్కిల్ ఇన్స్పెక్టర్ బండారు వెంకట శివ ప్రసాద్ తెలిపారు. నెలకు సరిపడా రూ. లక్ష విలువైన నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు.కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గన్నవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ బండారు వెంకట శివ ప్రసాద్ పాల్గొన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరూ తోటి వారికి, పేదలకు సహాయ సహకారాలను అందిస్తే సమాజంలో పేదరికంను అరికట్టవచ్చని తెలిపారు. హైదరాబాదుకు చెందిన మదర్ తెరిసా సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో గన్నవరంకు చెందిన బీకేర్ వృధా సరమా సేవా సంఘంలో ఆశ్రయం పొందుతున్న 50 మందికి నెలకు సరిపడా నిత్యావసర సరుకుల పంపిణీ చేయడం జరిగింది. ఇందులో సంస్థకు సంబందించిన సికిరేటర్ సుధీర్ మాట్లాడుతూ మొథెర్ తట?రీసా ఏ వీరు చేస్తున్న సేవలకు ఆదర్శం అని అన్నరు ఈకార్యక్రమంలో బి కే ర్ ఆశ్రమ వ్యవస్థాపకులు మాధవి పాల్గొన్నారు.

## బీసీల సంక్షేమం ఎన్డీయే కూటమితోనే సాధ్యం



**శ్రీకాళహస్తి జూన్ 26 :(వార్తా ప్రభ ప్రతినిధి)**గడచిన నాలుగు దశాబ్దాలుగా వెనుకబడిన వర్గాలకు అండగా నిలబడి, వారి అభ్యున్నతికి ప్రత్యేకంగా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్న తెలుగుదేశం పార్టీ మరియు ఎన్డీయే కూటమితోనే బీసీలకు మేలు జరుగుతుందని శ్రీకాళహస్తి నియోజకవర్గ, తెలుగుదేశం పార్టీ నాయకులు కొనియాడారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విధ్వంసకర వైసిపి పాలన అంతమై, వికాసం వైపు అడుగులు వేస్తూ ముందుకు వెళుతున్న చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో మరో 10 మహాత్మా జ్యోతిబా పూలే గురుకులాల ఏర్పాటుకు రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో దసరాదాచారి ఉమేష్ రావు కిషోర్ నారాయణ పాల్గొన్నారు

# ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం

**ఆత్మకూరు జూన్ 26 (వార్తాప్రభ)** ఆత్మకూరు పట్టణంలో ప్రపంచ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం శుక్రవారం నెల్లూరు జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వారి ఆదేశాల మేరకు ఆత్మకూరు ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ప్రియదర్శిని జూనియర్ కళాశాలలో ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని ఆత్మకూరు ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ సబ్ ఇన్స్పెక్టర్ మరియు వారి సిబ్బందితో కలిసి విద్యార్థి విద్యార్థినులకు విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో మాదక ద్రవ్యాల వినియోగం వల్ల వ్యక్తిగతంగా కుటుంబపరంగా మరియు సమాజపరంగా కలిగే తీవ్రమైన దుష్పరిణామాల గురించి సవివరంగా వివరించడం జరిగింది. ముఖ్యంగా విద్యార్థి దశలో మాదక ద్రవ్యాల బారిన పడటం వల్ల విద్యాభ్యాసం దెబ్బతినడం శారీరక మరియు మానసిక ఆరోగ్యం క్షీణించడం భవిష్యత్తు అవకాశాలు కోల్పోవడం కుటుంబ ప్రతిష్ఠ దెబ్బతినడం వంటి అనేక ప్రతికూల ప్రభావాలపై అవగాహన కల్పించబడింది. అదేవిధంగా మాదక ద్రవ్యాల నిర్మూలనలో




విద్యార్థుల పాత్ర అత్యంత కీలకమని తాము మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండటమే కాకుండా తమ స్నేహితులు కుటుంబ సభ్యులు మరియు సమాజంలోని ఇతరులకు కూడా అవగాహన కల్పించి డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని సూచించడం జరిగింది. అనుమానాస్పద మాదక ద్రవ్యాల కార్యకలాపాలు కనిపించినట్లయితే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని తెలియజేయబడింది. అలాగేమాదక ద్రవ్యాల తయారీ నిల్వ రవాణా విక్రయం కొనుగోలు వినియోగం వంటి నేరాలపై ఎన్డీపీఎస్ యాక్ట్ 1985 ప్రకారం అమలులో ఉన్న కఠినమైన శిక్షలు చట్టపరమైన చర్యలు మరియు వాటి వల్ల కలిగే శాశ్వత పరిణామాల గురించి విద్యార్థులకు సమగ్రంగా వివరించడం జరిగింది. ఒకసారి డ్రగ్స్ వ్యసనానికి లోనైతే వ్యక్తి జీవితమే కాకుండా కుటుంబం మరియు సమాజం కూడా తీవ్రంగా నష్టపోతాయని తెలియజేశారు. చివరగా ప్రతి విద్యార్థి మాదక ద్రవ్యాలకు "నో" చెప్పాలని ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని విద్య క్రీడలు సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచిస్తూ డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి అందరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని ప్రతిజ్ఞ చేయించడం జరిగింది.

## పీర్ల పండుగలో షహదత్ ముఖ్య ఘట్టం



**చేజర్ల జూన్ 26 (వార్తాప్రభ)** మొహర్రం పండుగ సందర్భంగా చేజర్లలో ఏర్పాటు చేసిన పీర్ల పండగలలో అతి ముఖ్యమైనది షహదత్ పర్వదినం. ఈ సందర్భంగా శుక్రవారం తెల్లవారుజాము నుండి ఈ షహదత్ పర్వదినం ప్రారంభమైంది. మొహర్రం పండుగ సందర్భంగా పీర్లను గ్రామంలోని అన్ని వీధులలో గ్రామోత్సవం గా నిర్వహిస్తూ భక్తులకు పీర్లు దర్శనం ఇస్తాయి. వీధిలోకి వచ్చిన పీర్లను భక్తులు ఎంతో భక్తి శ్రద్ధలతో మొక్కుతూ నీటితో శుద్ధి చేస్తూ ప్రసాదాలను నైవేద్యంగా సమర్పిస్తారు. సాయంత్రం ప్రత్యేక ప్రార్థనలతో పీర్ల పండగ ముగిస్తుంది. చేజర్లలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కమిటీ మెంబర్లు షేక్ నజీర్ షేక్ మునీర్ నజీర్ అహ్మద్ మొహమ్మద్ ఆలీ రఫీ తదితర ముస్లిం యూత్ పాల్గొని ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు.

## చెడు వ్యసనాలను విడనాడాలి - ప్రొహిబిషన్ సీఐ. పిలుపు....



**కంచికచర్ల జూన్ 26 : వార్తా ప్రభ....** నషా ముక్తి భారత్ కార్యక్రమంలో భాగంగా యాంటీ డ్రగ్ డే సందర్భంగా కంచికచర్లలోనీ గొట్టుముక్కల రోడ్డు నందు విద్యార్థినీ విద్యార్థులు ప్రజలతో శుక్రవారం ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రొబిషన్ సిఐ మాట్లాడుతూ విద్యార్థులతో పాటు నేటి యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఆమె తెలియజేశారు. ప్రతి ఒక్కరూ మంచి అలవాట్లు నేర్చుకోవాలని భవిష్యత్తును బంగారు బాటగా మలుచుకోవాలని ఆమె సూచించారు. చెడు వ్యసనాలకు బానిసలుగా మారి తమతో పాటు తమ తల్లిదండ్రులకు కూడా చెడ్డ పేరు తీసుకురావద్దని సలహాలను వారికి కంచికచర్ల ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ అష్రఫున్నీసా బేగం తెలియజేసినారు. విద్యార్థులు బాగా విద్యలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆమె రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది శ్రీనివాస్ బాబు, భాస్కర్, ప్రకాష్ పాల్గొన్నారు

## రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు జగ్గయ్యపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కేడర్ మీటింగ్ - సర్ పై అవగాహన సదస్సు నిర్వహణ

**జగ్గయ్యపేట జూన్ 26 (వార్తప్రభ)** రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు జగ్గయ్యపేట పట్టణంలోని శాసనసభ్యుల కార్యాలయంలో జగ్గయ్యపేట నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కేడర్ మీటింగ్‌తో పాటు సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిషన్ ) పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) , మాదిగ కార్పొరేషన్ చైర్మన్ జగ్గయ్యపేట నియోజకవర్గ పరిశీలకురాలు మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి పాల్గొని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కేడర్ పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త ప్రజలకు మరింత చేరువై ప్రభుత్వ సంక్షేమ పథకాలను విస్తృతంగా వివరించాలని సూచించారు. పార్టీ ఇచ్చిన ప్రతి కార్యక్రమాన్ని బాధ్యతగా తీసుకుని గ్రామ స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిషన్) కార్యక్రమంపై సమగ్ర అవగాహన కల్పిస్తూ, ఓటరు జాబితాల సవరణ ప్రక్రియలో పార్టీ నాయకులు, బూత్ స్థాయి కార్యకర్తలు చురుకుగా పాల్గొనాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని, అనర్హ పేర్లపై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. ఓటరు జాబితా ప్రజాస్వామ్యానికి పునాది అని, దానిని పారదర్శకంగా, కచ్చితంగా రూపొందించే ప్రక్రియలో పార్టీ శ్రేణులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గ పరిశీలకురాలు, మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి మాట్లాడుతూరాష్ట్ర పార్టీ సూచించిన కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడంలో



ప్రతి కార్యకర్త భాగస్వామి కావాలని సూచించారు. బూత్ కమిటీలను మరింత బలోపేతం చేసి, ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కార దిశగా కృషి చేయాలని కోరారు. పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ సంస్థాగత నిర్మాణం, సభ్యత్వ నమోదు, బూత్ స్థాయి కార్యాచరణ, ప్రజా సమస్యల పరిష్కారానికి అనుసరించాల్సిన విధానం, రానున్న పార్టీ కార్యక్రమాలపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను తెలుసుకుని, పార్టీ మరింత బలోపేతం కోసం చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట నియోజకవర్గానికి చెందిన వివిధ హోదాలలో ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకులు, మండల, పట్టణ, గ్రామ కమిటీ సభ్యులు, అనుబంధ విభాగాల ప్రతినిధులు, బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా మంత్రి ఆనం వారసుని జన్మదిన వేడుకలు



**ఆత్మకూరు జూన్ 26 (వార్తాప్రభ)** రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మనవడు బద్వేల్ వాసి మాజీ మంత్రి వీరారెడ్డి ముని మనవడు ఆనం కుమార్తె లీల కైవల్య రెడ్డి కొండ్రెడ్డి రితీష్ రెడ్డి ప్రథమ పుత్రుడు చిరంజీవి చిన్నారి కొండ్రెడ్డి సౌరిస్ వీరారెడ్డి జన్మదినం సందర్భంగా నేడు ఆత్మకూరు పట్టణ తెలుగుదేశం పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు తుమ్మల. చంద్రారెడ్డి మరియు పార్టీ నేతల ఆదేశాలతో తెలుగు యువనేత నెల్లూరు శివారెడ్డి సూచన సలహాలతో కొండ్రెడ్డి సౌరిస్ వీరారెడ్డికి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆత్మకూరు పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు ఉదయగిరి సుధాకర్ పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు తోట సందీప్ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో మొదట దేవాలయాల్లో పూజలు నిర్వహించి అనంతరం భారీ కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బాణాసంచా కాల్చి స్వీట్లు కేకు పంచిన అనంతరం సుమారు 1000 మందికి అన్నా క్యాంటీన్లో ఈరోజు పూర్తిగా ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయగిరి సుధాకర్, తోట సందీప్ బి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఆత్మకూరు అభివృద్ధి ఆత్మకూరు శ్రేయస్సు కాంక్షించే ఆనం రామనారాయణ రెడ్డి గారి వారసులు ఎంతో సంతోషంగా ఉండాలని వారి మనవడు భగవంతుని ఆశీస్సులతో ఆనందంగా ఉండాలని కోరుతున్నామని తెలిపారు. ఈ జన్మదినం వేడుకల కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు చింతా సునీల్ చింతా మనోజ్ బొగ్గవరపు మహేంద్ర శ్రీనాథ్ చంద్రబాబు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు. కేక్ కటింగ్ నిర్వహించిన అనంతరం అన్న క్యాంటీన్ లో ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## సర్ కార్యక్రమం ముమ్మరం...



**కంచికచర్ల, జూన్ 26 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కంచికచర్ల పట్టణ పరిధిలో సర్ కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతుంది. ఈ సందర్భంగా స్థానిక 203 బూతు పరిధిలో బిఎల్ఓ గొర్రెపాటి రాంబాబుతో కలిసి బూత్ఇంచార్జి నగరికంటిఏసోబు ఇంటి ఇంటికి తిరిగిఓటర్ నమోదు పత్రాలను సేకరణ కార్యక్రమం ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడోవ సచివాలయం పరిధిలో 1092 ఓట్లు ఉన్నాయని వాటిలో 60 శాతం ఓటర్లకు ఇచ్చిన నమోదు పత్రాలను స్వీకరించడం జరిగింది అన్నారు. వాటిలో ఇప్పటికే 650 ఆన్లైన్ చేయడం జరిగింది అన్నారు. మిగిలినవి కూడా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరితి గతిన పూర్తి చేస్తామని వారు శుక్రవారం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మూలస చంద్రం తదితరులు పాల్గొన్నారు.

## వాగ్దేవి కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌లో ఘనంగా ల్యాంప్ లైటింగ్ మరియు ఫ్రెషర్స్ డే వేడుకలు



**జగ్గయ్యపేటలోని జూన్ 26 (వార్తప్రభ)** పట్టణం లోని వాగ్దేవి కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ఆధ్వర్యంలో నూతన విద్యార్థినుల ల్యాంప్ లైటింగ్ కార్యక్రమం మరియు ఫ్రెషర్స్ డే వేడుకలు శుక్రవారం అంగరంగ వైభవంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య) హాజరై విద్యార్థినులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రపంచ నర్సింగ్ సేవలకు ఆద్యురాలైన ఫ్లోరెన్స్ నైటింగేల్ సేవా స్ఫూర్తికి ప్రతీకగా ల్యాంప్ లైటింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని, క్యాండిల్ వెలుగు సేవా భావానికి, కరుణకు, మానవత్వానికి ప్రతీక అని వివరించారు. నర్సింగ్ ప్రతిజ్ఞ చేసిన విద్యార్థినులను అభినందిస్తూ, నర్సింగ్ అనేది అత్యంత గొప్ప సేవా వృత్తి అని, వైద్య రంగంలో విశేష ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు అంకితభావంతో, సేవా దృక్పథంతో రోగులకు ఉత్తమ వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథులుగా డాక్టర్ ఎస్. నరసింహారావు, డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ నందకిషోర్, డాక్టర్ అనూష పాల్గొని ప్రసంగించారు. స్థానిక మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ మాట్లాడుతూ, వాగ్దేవి నర్సింగ్ కళాశాల విద్యార్థినులు క్లినికల్ ప్రాక్టీస్‌లో ప్రతిభ కనబరుస్తున్నారని అభినందించారు. డాక్టర్ నందకిషోర్ మాట్లాడుతూ, జగ్గయ్యపేటలో నర్సింగ్ కళాశాల స్థాపన వల్ల ఈ ప్రాంత ఆసుపత్రులకు నాణ్యమైన నర్సింగ్ సిబ్బంది అందుబాటులోకి వస్తారని, తద్వారా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించే అవకాశం కలుగుతుందని తెలిపారు. డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ, వైద్యరంగంలో నర్సింగ్ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారని, వైద్యుడు మరియు రోగి మధ్య వారధిగా నిలుస్తున్నారని వివరించారు. డాక్టర్ అనూష మాట్లాడుతూ, ప్రతి నర్సింగ్ విద్యార్థిని శరీరంలోని ప్రతి అవయవం ఎలా పనిచేస్తుంది, దాని ఉపయోగం ఏమిటి, అది సరిగా పనిచేయకపోతే కలిగే పరిణామాలు ఏమిటి అనే మూడు అంశాలపై సమగ్ర అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. డాక్టర్ ఎస్. నరసింహారావు మాట్లాడుతూ, జగ్గయ్యపేట ప్రాంత ప్రజలకు ఉన్నత ప్రమాణాల వైద్య సేవలు అందించే లక్ష్యంతో వాగ్దేవి కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌ను స్థాపించామని, ఉత్తమ నర్సులను తీర్చిదిద్దేందుకు కళాశాల కృషి చేస్తోందని తెలిపారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ బుస్సా సరిత మరియు డాక్టర్ బుస్సా సురేష్ మాట్లాడుతూ, స్థానిక శాసనసభ్యులు మరియు పట్టణంలోని ప్రముఖ ఆసుపత్రుల సహకారంతో నర్సింగ్ కళాశాలను స్థాపించి, పేద మరియు మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన నర్సింగ్ విద్యతో పాటు ఉత్తమ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. కళాశాల చైర్మన్ డాక్టర్ బుస్సా సురేష్ మాట్లాడుతూ, ప్రభుత్వ అనుమతులతో నిర్వహించబడుతున్న నర్సింగ్ కళాశాలల్లోనే విద్యార్థులు చేరి విద్యను అభ్యసించాలని, తద్వారా వారి భవిష్యత్తు సురక్షితంగా ఉంటుందని సూచించారు. అనంతరం విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, వైద్యులు, విద్యార్థినులు, తల్లిదండ్రులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## నేడు గన్నవరం చేరుకోనున్న ఎమ్మెల్యే యార్లగడ్డ



**గన్నవరం : జూన్ 26 :(వార్తా ప్రభ ప్రతినిధి)** వ్యక్తిగత పనుల నిమిత్తం అమెరికా పర్యటనకు వెళ్లిన ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు శనివారం గన్నవరం చేరుకొనున్నారు. అమెరికాలోని వ్యాపార కార్యకలాపాలను ప్రత్యక్షంగా పర్యవేక్షించేందుకు ఈనెల 6వ తేదీ కుటుంబ సమేతంగా యార్లగడ్డ వెంకట్రావు అమెరికా వెళ్లారు. 20 రోజులు పాటు అమెరికాలో ఉన్న ఆయన పర్యటనని విజయవంతంగా ముగించుకొని శనివారం సాయంత్రం గన్నవరం విమానాశ్రయానికి రానున్నారు. కాగా అమెరికాలో వ్యాపారసంస్థలు నిర్వహిస్తున్న యార్లగడ్డ గత అసెంబ్లీ ఎన్నికల తర్వాత కేవలం ఒక్కసారి మాత్రమే అమెరికా వెళ్లిన ఆయన కేవలం 10రోజులు మాత్రమే అక్కడ ఉన్నారు. గత ప్రభుత్వ హయాంలో పెట్టిన అక్రమ కేసులు కారణంగా గత రెండు సంవత్సరాలుగా ఆయన అమెరికా వెళ్లేందుకు కేసులు అడ్డంకిగా మారాయి. అమెరికాలోని తన వ్యాపార కార్యక్రమాలను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు అనుమతి ఇవ్వాలని వెంకట్రావ్ కోర్టుకు విజ్ఞప్తి చేయడంతో ఇటీవల కోర్టు అమెరికా పర్యటనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎమ్మెల్యే గా ఘనవిజయం సాధించిన తరువాత గత రెండు సంవత్సరాలు గా స్థానికంగా ప్రజలకు అందుబాటులో ఉంటూ గన్నవరం అభివృద్ధితోపాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. అమెరికా పర్యటన ముగించుకుని గన్నవరం వస్తున్న యార్లగడ్డకు ఘనంగా స్వాగతం పలికేందుకు టిడిపి నాయకులు కార్యకర్తలు సన్నద్ధమవుతున్నారు.

## ఘనంగా మొహర్రం వేడుకలు

**సంగం జూన్ 26 (వార్తాప్రభ ప్రతినిధి)** సంగం మండలం తలుపురుపాడు లోనీ పీర్ల సావిడి వద్ద ముస్లిం సోదరులు మొహరం వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం పీర్లు ఊరేగింపు నిర్వహించారు. డీ జే చప్పుళ్లతో తప్పెట్లు తాళాలతో పీర్లు ఊరేగింపు గ్రామ పురవీధులలో వైభవంగా సాగింది. అనంతరం పీర్ల సావిడీ వద్ద భక్తులు భక్తిశ్రద్ధలతో గుండం తొక్కారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం లో సంగం సాగునీటి సంఘం అధ్యక్షులు షేక్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## మిర్చి లారీ బోల్తా

**- రోడ్డు దాటుతున్న వ్యక్తిని తప్పించబోయి అదుపు తప్పిన లారీ**

**- ఇబ్రహీంపట్నం - ఛత్తీస్ గఢ్ జాతీయ రహదారిపై కొండపల్లి శ్రామిక నగర్ వద్ద ఘటన**



**ఇబ్రహీంపట్నం, జూన్ 26 (వార్త ప్రభ ప్రతినిధి):** ఇబ్రహీంపట్నం – ఛత్తీస్ గఢ్ జాతీయ రహదారిపై కొండపల్లి శ్రామిక నగర్ (కొత్తగేటు) వద్ద శుక్రవారం మిర్చి లారీ అదుపు తప్పి రోడ్డుపై బోల్తా పడింది. మైలవరం వైపు అతి వేగంగా వెళ్తున్న లారీ రోడ్డు దాటుతున్న వ్యక్తిని తప్పించబోయి అదుపు తప్పి కొండపల్లి – ఇబ్రహీంపట్నం మార్గంలో రోడ్డుకు అడ్డంగా బోల్తా పడినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. రోడ్డు దాటుతున్న నందిగామకు చెందిన వ్యక్తి (50)కి తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం ట్రాఫిక్ పోలీసులు అంబులెన్స్ లో విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాద సమయంలో వాహనాలు రాకపోవడంతో పెద్ద ముప్పు తప్పింది. లారీ రోడ్డు మధ్యలో పడిపోవడంతో ట్రాఫిక్ కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసులు క్రేన్ సాయంతో లారీని తొలగించి ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రభుత్వానికి కృతజ్ఞతలు- పి.ఆర్.టి.యు



**జగ్గయ్యపేట జూన్ 26 (వార్తప్రభ)**2003 డి.ఎస్.సి వారికి, పాత పెన్షన్ విధానం అమలు చేస్తూ జి.ఓ నంబర్ 57 కు,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపిన సందర్భంగా, జగ్గయ్యపేట నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ని, జగ్గయ్యపేటలోని వారి నివాసం వద్ద,పి.ఆర్.టి.యు నాయకులు కలిసి,యం.ఎల్.ఎ ద్వారా,రాష్ట్ర ముఖ్య మంత్రివర్యులు నారా.చంద్రబాబు నాయుడుకి, ఉపముఖ్యమంత్రివర్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ కి,విద్యా శాఖమంత్రివర్యులు నారా లోకేష్ కి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పెద్దలకు,అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అప్పటి మరియు ఇప్పటి ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ యం.ఎల్.సి మరియు పి.ఆర్.టి.యు ఫ్రంట్ ఫ్లోర్ లీడర్ గాదె శ్రీనివాసులు నాయుడు 2016 వ సంవత్సరంలో,అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ ద్వారా మొట్టమొదటిగా,2003 డి.ఎస్.సి వారి పక్షాన ప్రాతినిధ్యం చేసి,అప్పటి నుండి,ఇప్పటి దాకా ఎన్నో ప్రాతినిధ్యాలు ఇచ్చిన పిదప,2003 డి.ఎస్.సి వారి న్యాయమైన సమస్యకు, పరిష్కారం చూపుతూ, వారికి పాత పెన్షన్ విధానం అమలుకు,ప్రస్తుత ప్రభుత్వం ఆమోదం తెలపటం హర్షణీయమని వారు తెలిపారు. ఈ సందర్భంగా యం.ఎల్.ఎ మాట్లాడుతూ, ఇంకా విద్యా సంబందిత ఏ సమస్యలు ఉన్నా,తన దృష్టికి తెచ్చినట్లయితే,వాటి పరిష్కారంనకు కూడా తాను తప్పకుండా కృషి చేస్తానని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.ఆర్.టి.యు ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి సోలా రాఘవరాజు,జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కోసూరి రాజశేఖర్,పి.ఆర్.టి.యు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మర్రి ప్రభాకర్, రాష్ట్ర నాయకులు నేలవెల్లి రమేష్ బాబు, కొనకళ్ళ రమేష్, జగ్గయ్యపేట మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోడేపూడి శ్రీనివాసరావు, కొమ్మవరపు కరుణాకర్, వత్సవాయి మండల అధ్యక్షుడు అద్దంకి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలన చేసిన తహసీల్దారు



**సంగం జూన్26 (వార్తాప్రభ)** సంగం మండలం తిరమన తిప్ప ఎస్టీ కాలనీలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను తహసిల్దార్ సారంగపాణి శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పరిశీలిస్తూ బీఎల్ఓలు నిర్వహిస్తున్న విధులను సమీక్షించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తిస్థాయిలో పారదర్శకంగా కట్టుదిట్టంగా నిర్వహించాలని బీఎల్ఓలకు ఆదేశించారు. ఓటర్ల వివరాల నమోదు ధృవీకరణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఎన్నికల సంఘం నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు.

# 36 కుటుంబాలకు రూ.23.40లక్షల సియం రిలీఫ్ ఫండు పంపిణి చేసిన ఎమ్మెల్యే వెనిగండ్ల



**గుడివాడ,జూన్ 26 (వార్తాప్రభ) :** సియం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజల సంతోషం కోసమే పనిచేస్తుందని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శుక్రవారం స్థానిక ఏలూరు రోడ్డులోని ప్రజావేదిక కార్యాలయంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావుతో కలసి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను నియోజకవర్గ పరిధిలోని 36 బాధిత కుటుంబాలకు రూ. 23.40 లక్షల సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ డైరెక్టర్లు గోకవరపు సునీల్, మజ్జాడ నాగరాజు, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, టిడిపి అధ్యక్షులు పంద్రాజు సాంబయ్య, నాయకులు లింగం ప్రసాద్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా ఫాదర్ గుజ్జుల పుటినరోజు వేడుకలు

**గుడివాడ,జూన్ 26 (వార్తాప్రభ) :** ఎంతో మందికి దేవుని పట్ల విశ్వసం నేర్పించి, నేటి యవ గురువులకు అదర్శవంతంగా తీసుకోవలసిన వ్యక్తి ఫాదర్ గుజ్జుల మైఖేల్ అని గుడ్‌మెన్ పేట విచారణ గురువు లూయిస్‌రాజు, సహయ గురువు బాలస్వామిలు అన్నారు. శుక్రవారం స్థానిక ఏలూరురోడ్డులోని మౌంట్ కార్మిల్ మాత(ఆర్‌సియం) దేవలయం విచారణ గురువు ఫాదర్ గుజ్జుల మైఖేల్ జన్మదినోత్సవ వేడుకలను విశ్వసుల అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుడ్‌మెన్ పేట విచారణ గురువు లూయిస్‌రాజు, సహయ గురువు ఫాదర్ బాలస్వామిలు మాట్లాడుతూ ఫాదర్ గుజ్జుల మైఖేల్ తన జీవితంలో ఎంతో మందికి సహయం అందించి దేవుని మార్గంలో నడిపించడం జరిగిందన్నారు. అయన మరీన్ని పుట్టినరోజు వేడుకలు నిర్వహించుకోవలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ అధ్యక్షుడు ఏలేటి విలియంజోషి, సభ్యులు వీరాబత్తిన జీవరత్నం, బాలరాజు, ఉపదేశకులు దార సబాష్టిన్, ఆంథోని, క్రీస్తురాజు, భాస్కర్, విజయరాజు, సిష్టర్లు,



యూత్ సభ్యులు, మరియదళ సభ్యులు, విన్సెంట్ సొసైటి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# డివిజన్ లో 706.52 టన్నుల యూరియా పంపిణీకి సిద్ధంగా ఉంది

## -మైలవరం ఏడిఏ యమ్.శ్రీనివాసరావు

**మైలవరం,జూన్ 26 (వార్తాప్రభ) :** మైలవరం డివిజన్ పరిధిలోని మండలాల్లో 706.52 టన్నుల యూరియా పంపిణీకి సిద్ధంగా ఉందని మైలవరం సహాయ వ్యవసాయ సంచాలకులు యమ్.శ్రీనివాసరావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు.మైలవరం డివిజన్ లోని మైలవరం, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం మండలాల్లో ఉన్న యూరియా ఎరువు లభ్యత వివరాలు వెల్లడించారు. మైలవరం మండలంలో మొత్తం 282.2 టన్నుల యూరియా పంపిణీకి సిద్ధంగా ఉందని, దీనిలో సొసైటీ(పిఏసిఎస్)ల్లో 98 టన్నులు, ప్రైవేట్ ఎరువుల దుకాణాలలో 184.2 టన్నులు ఉందని తెలిపారు.జి.కొండూరు మండలంలో మొత్తం 333.71 టన్నుల యూరియా పంపిణీకి సిద్ధంగా ఉందని, దీనిలో సొసైటీ(పిఏసిఎస్)ల్లో 116.8 టన్నులు, ప్రైవేట్ ఎరువుల దుకాణాలలో 216.91 టన్నులు ఉందన్నారు. ఇబ్రహీంపట్నం మండలంలోని సొసైటీ(పిఏసిఎస్)ల్లో 90.61 టన్నులు యూరియా పంపిణీకి సిద్ధంగా ఉందని తెలియజేశారు.యూరియా మరియు డీ ఏ పి ఎరువు రైతులందరికీ ఏపిఏఐయంఎస్ 2.0 యాప్ ద్వారా రైతు సాగుచేసే పొలం మరియు పంట వివరములకు సంబంధిచిన శాస్త్రవేత్తల సిఫార్సు మేరకు అందించటం జరుగుతుందని ఏడిఏ శ్రీనివాసరావు తెలియజేశారు.యూరియా సరఫరా మరియు పంపిణీలో ఎటువంటి జాప్యత లేకుండా రైతులకు అందించటం జరుగుతుందని,ఎరువులు కావలసిన రైతులు వారి ఆధార్ నంబరు మరియు ఆధార్ కి లింకు అయిన ఫోను తీసుకురావటం ద్వారా పొందగలరని తెలిపారు. రైతులు ఏమైనా ఇబ్బందులు ఎదుర్కొన్న యెడల ఆయా గ్రామ వ్యవసాయ ఉద్యాన సహాయకులు లేదా మండల వ్యవసాయ అధికారిని సంప్రదించాలని కోరారు.

# వందేమాతరం గేయ రచయిత జయంతి వేడుకలు...



**కృత్తివెన్ను,జూన్ 26 (వార్తాప్రభ) :** భీమవరం వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 201 గవర్నర్ కార్యాలయం నందు శుక్రవారం వందేమాతరం గేయ రచయిత బంకించంద్ర చటర్జీ జయంతి సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, డిస్ట్రిక్ట్ టు జీరో వన్ క్యాబినెట్ సెక్రటరీ కొప్పినీడి సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి వాకర్స్ గవర్నర్ వాకర్ వడుపు గోపి, శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సూర్యప్రకాష్ మాట్లాడుతూ ఆధునిక బెంగాలీ సాహిత్య పితామహుడు భారత జాతీయ ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిన గొప్ప రచయిత కవి ఉద్యోగి సాహిత్య సామ్రాట్ బంకించంద్ర చటర్జీ రచించిన వందేమాతరం పాట స్వాతంత్ర్య పోరాటంలో లక్షలాదిమందికి ఉత్తేజాన్నిచ్చిందని బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా నినాదంగా మారిందని ఈయన రచనలు చదివి ఎందరో యువకులు దేశం కోసం ప్రాణత్యాగానికి సిద్ధమయ్యారని భారతీయ సంస్కృతి హిందూ తత్వశాస్త్రం గొప్పతనాన్ని ప్రపంచానికి చాటిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో క్యాబినెట్ ట్రెజరర్ హనుమంతరావు గ్రంధి ప్రసాద్ పావిరాల రామ్ మోహన్ రావు, నల్లం రఘు బాబు ఇంజనీర్ సీతారామస్వామి తదితరులు పాల్గొని జాతీయ గేయం ఆలపించారు.

# గృహప్రవేశ కార్యక్రమంకు అయిన అతిరథ మహారధులు







**విస్సన్నపేట,జూన్ 26 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలోని తాతకుంట్ల మిట్ట గూడెం గ్రామంలో అత్యాధునిక వసతులతో ఆకుపచ్చని ప్రకృతి సంపదతో కూడిన డూప్లెక్స్ హౌస్ ఇంజనీర్ మేడా శ్రీనివాసరావు నిర్మించడం జరిగింది. అన్ని రకాల అంగులతో నైనానందకారంగా నభూతోన భవిష్యతి అన్న చందంగా ఋషికొండ భవనాల పోలిన భవనశీను ముఖ్యఅతిథిగా పాల్గొన్న అంతర్జాతీయ క్రైస్తవ మిషనరీ సేవకులు గంటా ఫిలిఫ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తిరువూరు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు నల్లగట్ల స్వామి దాస్, కొక్కిలిగడ్డ రక్షణ నిధి, విద్యాసంస్థల అధినేతలు, ఉద్యోగులు రైతులు కాంట్రాక్టర్లు పలు రాజకీయ పార్టీ నాయకులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఈ నెల 28 న కాప్స్ రాక్స్ ఎడ్యుకేషన్ చారిటీ మహోత్సవం

- ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 200 మంది కీ 18 లక్షలు పంపిణీ
- జిల్లా కో -ఆర్డినేటర్ నాగడమూడి సత్య నారాయణ రాజు





**కాకినాడ,జూన్ 26 (వార్తాప్రభ) :** కాప్స్ రాక్స్ ఎడ్యుకేషన్ చారిటీ మహోత్సవం ఈ నెల 28 న నిర్వహిస్తామని జిల్లా కో -ఆర్డినేటర్ నాగడమూడి సత్య నారాయణ రాజు చెప్పారు. శుక్రవారం సాయంత్రం స్థానిక శుభం కాపు కళ్యాణ మండపంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ పెద్దిరెడ్డి శివ భాస్కర్ వ్యవస్థాపకుడిగా కాప్స్ రాక్స్ 2016 వ సంవత్సరం లో ప్రారంభమైందని చెప్పారు. అప్పటి నుంచి ఇప్పటి వరకూ 10,000 పైగా రక్తదాన శిబిరాలు నిర్వహించామని తెలిపారు. అదే విధంగా విద్యార్థులకు ఉపకార వేతనాలు అందిస్తున్నామని వివరించారు. నేడు ప్రపంచ వ్యాప్తంగా ఎందరో సంఘ సభ్యులకు ఉపయోగ పడుతుందని అన్నారు. కాపు నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించమని అన్నారు.28 వ తేదీన జరిగే కార్యక్రమానికి కాకినాడ ఎంపీ తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ 5లక్షలు, ఒంగోలు పేస్ కాలేజ్ యాజమాన్యం రెండున్నర లక్షలు సహాయం చేశారని చెప్పారు. అదే విధంగా ఎమ్మెల్సీ పేరా బత్తుల రాజశేఖర్ తో పాటు పలువురు సహాయ సహకారం అందిస్తున్నారని అన్నారు.కాప్స్ రాక్స్ అడ్మిన్, ప్రోగ్రామ్ ఆర్గనైజేషన్ తరుపున పంతం రమణ కుమార్ మాట్లాడుతూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అర్హులు అయిన 200 మంది పేద కాపు విద్యార్థులకు రూ.18 లక్షలు స్కాలర్‌షిప్ లు అందిస్తున్నారని అన్నారు. స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్ ఐ ఎ ఎస్ అధికారిని శశి కళావశీ కరణ్ నేతృత్వంలో అర్హులు అందరికీ అందే విధంగా ప్రణాళిక రూపొందించారని అన్నారు.2016వ సంవత్సరం నుంచి ప్రతీ ఏడాది 600 మంది విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించారని తెలిపారు. తొలుత ఫేస్ బుక్ ద్వారా పరిచయం అయిన కాప్స్ రాక్స్ నేడు ఏ సీ పీ పెద్దిరెడ్డి శివ భాస్కర్ నేతృత్వంలో ప్రతీ మండలంలో అడ్మిన్లను నియమించారని వివరించారు. మొత్తం 14 గ్రూపులు తమ సంఘం ఆధ్వర్యంలో పనిచేస్తున్నాయని తెలిపారు.సమావేశంలో కాకినాడ జిల్లా పిఆర్ వో డాక్టర్ కె. రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు

# వేదాలు వ్యక్తి ఔన్నత్యం పెంచుతాయి - ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

- తాడేపల్లి మలయాళ ఆశ్రమంలో వేద పాఠశాల ప్రారంభం.



**ఘంటసాల/అవనిగడ్డ,జూన్ 26 (వార్తాప్రభ) :** వేదాలు వ్యక్తి ఔన్నత్యం పెంచుతాయని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. శుక్రవారం ఘంటసాల మండలం తాడేపల్లిలోని శ్రీ మలయాళ స్వామి ఆశ్రమంలో నూతనంగా ఏర్పాటు చేసిన శృతి భారతి వేద పాఠశాలను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, తిరుపతి - జాతీయ సంస్కృత యూనివర్సిటీ - కులపతి ఆచార్య గుళ్ళపల్లి శ్రీరామకృష్ణ, ఏర్పేడు వ్యాసాశ్రమ పీఠాధిపతి పరిపూర్ణానంద గిరి స్వామి చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ మాట్లాడుతూ పూర్వం వేద ఘోషతో అలరారిన దివిప్రాంతంలో మళ్ళీ వేదాల పునరుజ్జీవనానికి బాటలు వేస్తున్న మలయాళ స్వామి ఆశ్రమం వారిని అభినందించారు. మనిషి నడవడికను తీర్చిదిద్దే వేద అధ్యయనం వినయ సంపన్నత అలవరుస్తుందన్నారు. కేరళ నుంచి వచ్చిన మలయాళ స్వామి ప్రధానంగా ఈ ప్రాంతంలో భక్తి, ధ్యానం, సేవ ధ్యేయాలతో కార్యక్రమాలు నిర్వహించారన్నారు. తనను తాను తెలుసుకోవటమే నిజమైన విద్య - తనను తాను జయించటమే నిజమైన విజయం అని ప్రభోధించిన మలయాళ స్వామి బోధనలు మనిషి వ్యక్తిత్వాన్ని వికసింపచేస్తాయన్నారు. ఆధునిక శాస్త్ర విజ్ఞానంతో పలుమార్లు అనర్థాలు సంభవిస్తున్నప్పటికీ, వేద విజ్ఞానం మాత్రమే ఉన్నత సమాజానికి బాటలు వేస్తోందన్నారు. ప్రపంచ దేశాల్లో దాదాపు కుటుంబ వ్యవస్థ అంతరించిపోయినా, భారతదేశంలో కుటుంబ వ్యవస్థ పరిఢవిల్లుతుందంటే అందుకు ప్రధాన కారణం వేదాల ద్వారా భారతీయులు అలవర్చుకున్న సంస్కారమే ప్రధాన కారణం అన్నారు. దేశంలో మరోసారి కుటుంబ వ్యవస్థకు ముప్పు ఏర్పడుతున్న నేపథ్యంలో మరోసారి వేదాల సారాన్ని సామాన్య ప్రజలకు చేరవేయటం, నేటితరానికి వేద శిక్షణ ఇవ్వటం ద్వారా సమాజంలో విలువలు కాపాడుకుందామని పిలుపునిచ్చారు. ఈ దిశగా నేటితరానికి వేద శిక్షణ ఇచ్చేందుకు వేద పాఠశాల ఏర్పాటు చేసిన మలయాళ స్వామి ఆశ్రమ నిర్వాహకులను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ అభినందించారు. కార్యక్రమంలో ప్రముఖ తెలుగు కవి, సినీ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగశాస్త్రి, ఎన్ఆర్ఐ మూల్పూరి వెంకటరావు - సావిత్రి దంపతులు, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి వెంకట రామకృష్ణ, అసంగానంద గిరిస్వామి, ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, తెలుగు సహస్రావధాని పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, కావూరి కోదండరామయ్య తదితరులు పాల్గొన్నారు.

# విశ్వ హిందూ పరిషత్తు ఆధ్వర్యంలో చేవెండ్ర లో రుద్రాక్ష పూజ..

## -దుర్గా వాహిని భజరంగ్ దళ్ లో చేరిన యువతీ యువకులు

**పెడన,జూన్ 26 (వార్తాప్రభ) :** ధర్మ పరిరక్షణ హిందువుల ఐక్యతకోసం విశ్వహిందూ పరిషత్ ధార్మిక కార్యక్రమంలలో భాగంగా పెడన మండలం చేవెంద్ర గ్రామంలో శుక్రవారం నాడు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. దుర్గా వాహిని మాతృశక్తి స్థానిక హిందూ బంధువుల సహకారంతో జిల్లా వ్యాప్తంగా నిర్వహింప బడుతున్న కార్యక్రమాల్లో భాగంగా గ్రామంలో కొలువై ఉన్న శ్రీ ఉమా పార్వతి సమేత చెన్నమల్లేశ్వర స్వామి ఆలయం నందు సింధూర్ కుంకుమార్చన రుద్రాక్ష అర్చన కార్యక్రమాలనుభక్తి శ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా స్థానిక యువతులు దుర్గావాహిని కార్యకర్తలుగా యువకులు భజరంగ్ దల్ కార్యకర్తలు గా ప్రమాణ స్వీకారం చేయడం జరిగింది. కార్యక్రమం విశిష్ట అతిథులుగా విశ్వ హిందూపరిషత్ ప్రాంత అధ్యక్షులు ఓబిలిశెట్టి వెంకటేశ్వర్లు ప్రభారి పీవీఎస్ నాయుడు ప్రముఖ న్యాయ వాది కూనప రెడ్డి శ్రీనివాస్ కార్య దర్శి వరే రాజశేఖర్ సహ కార్య దర్శి పిచ్చుక శంకర్ దుర్గా వాహిని కృష్ణాజిల్లా ప్రముఖ్ అంబటి తులసీ వసుంధర మాతృ శక్తి జిల్లా ప్రముఖ్ జి సాయిలత దుర్గా వాహిని కృత్తివెన్ను ప్రఖండ ప్రముఖ్





ఝూన్సీ లక్ష్మి భజరంగదల్ పెడన ప్రఖండ ప్రముఖ్ పి రాంబాబు కార్యాలయ ప్రముఖ్ జె సుబ్రమణ్యం జర్నలిస్ట్ పుట్టి కృష్ణ ప్రసాద్ గ్రామ పెద్దలు చిన్న సుబ్బారావు బీజేపీ ఆర్ ఎస్ ఎస్ కార్యకర్తలు అల్గొన్నారు. తదుపరి ఆలయ కమిటీ వారిచే ప్రసాద వితరణ నిర్వహించడం జరిగింది.కృష్ణా జిల్లా అధ్యక్షులు డాక్టర్ బూరగడ్డ శ్రీనాథ్ కార్యక్రమం లో పాల్గొన్న వారికి విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదములు తెలియ చేశారు.

# బి. సి.భవన్ కు ఎంపీ నిధుల నుండి 32 లక్షలు మంజూరు చేసిన బీదా మస్తాన్ రావు

- రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు, టిడిపి నేత ఎరిక్షన్ బాబు లకు ధన్యవాదాలు తెలిపిన శ్రీ కాటమరాజు గంగమ్మ దేవస్థానం కమిటీ





**మార్కాపురం,జూన్ 26 (వార్తాప్రభ) :** అభివృద్దే ధ్యేయంగా ఎన్నో పనులను రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో శాంక్షన్ చేయించిన ఎర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి గూడూరి ఎరిక్సన్ బాబు ఇటీవల రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు యాదవ్ నిధులనుండి శ్రీ కాటమరాజు స్వామి వారి ఆలయం వద్ద బిసి కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి 32 లక్షల రూపాయలు శాంక్షన్ చేయించారు.ఈ సందర్భంగా వారివురికి రాష్ట్ర యాదవుల తరఫున శ్రీ కాటమరాజు గంగమ్మ దేవస్థానం సభ్యులు,ఆచార గ్రామాల భక్తులు, పూజారులు,భక్తుల తరఫున ధన్యవాదాలు అభినందనలు తెలియజేసిన వారిలో ఆలయ కమిటీ ముఖ్యులు పి.ఎల్.పి.యాదవ్, ప్రధాన కార్యదర్శి బుర్రి చిన్న వెంకటేశ్వర్లు యాదవ్, ఉపాధ్యక్షుడు అల్లంరాజు శ్రీనివాస్ యాదవ్, ఉపాధ్యక్షుడు గంగుల ఎల్లయ్య యాదవ్, గుమ్మ గంగరాజు వెంకటేశ్వర్లు యాదవ్, గోసు వెంకట సుబ్బారావు యాదవ్, సిపిఎం పార్టీ నాయకులు న్యాయవాది గుమ్మా బాల నాగయ్య యాదవ్, గొర్ల గాలయ్య యాదవ్, నాగం రామకృష్ణ యాదవ్, వెంకటేష్ యాదవ్, మార్కాపురం జిల్లా కేంద్రానికి చెందిన న్యాయవాది పిన్నిక నాగార్జున ప్రసాద్(పి.ఎన్.పి.) యాదవ్, తెలుగుదేశం పార్టీ నాయకులు రాష్ట్ర రోడ్ల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ నక్క శ్రీనివాస్ యాదవ్, తోకల ఎల్లయ్య యాదవ్,పాముల పోలేరాజు పెద్దిరాజు యాదవ్ ఉన్నారు.

# ప్రధాన రహదారిపై కృత్రిమంగా అడ్డంకులు



**ఏలూరు జిల్లా, నూజివీడు,జూన్ 26 (వార్తాప్రభ) :** నూజివీడు మండలం, తుక్కులూరు గ్రామంలో ప్రధాన రహదారిపై కృత్రిమంగా అడ్డంకులు ఏర్పడుతున్నాయి. ఈ నేపథ్యంలో వాహనదారులు, పాదచారులకు సైతం ఇబ్బందులు తప్పడంలేదు. తుక్కులూరు గ్రామం నుండి జంగంగుడెం మీదుగా కాట్రేనిపాడు గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారిపై మామిడి చెట్లను నరికి, వాటి మొద్దులను పడవేయడంతో ఆ రహదారిపై ప్రయాణానికి అడ్డంకులు ఏర్పడుతున్నాయి. గత కొన్ని రోజులుగా రాత్రి సమయంలో ఈ రహదారిపై ప్రయాణిస్తున్న వాహనదారులు ప్రమాదాలకు గురైన సందర్భాలు ఉన్నాయని స్థానికులు వాపోతున్నారు. మామిడి ముద్దులను రోజులతరబడి రోడ్డు ప్రక్కనే పడవేసి ఉంచడంతో వాహనదారుల ప్రాణాలకు ముప్పు ఏర్పడే ప్రమాదం ఉంది. ఈ ప్రాంతంలో రెండు మలుపులు ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు చెప్పనలవి కావడంలేదు. ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించే క్రమంలో వాహనదారులు కిందపడి గాయాలపాలౌతున్నారు. సంబంధిత శాఖల అధికారులు స్పందించి రహదారులపై వాహనదారులకు ఇబ్బందులు కలిగించే వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# కృష్ణ మాదిగ కలిసిన బిజెపి నాయకులు



**రాజాం,జూన్ 26 (వార్తాప్రభ) :** ఉత్తరాంధ్ర జిల్లాలలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పర్యటిస్తున్న సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిసినా ఎమ్మార్పీఎస్ నేత భారతీయ జనతా పార్టీ విజయనగరం జిల్లా కార్యవర్గ సభ్యులు జొన్నాడ రంజిత్ రాజాం నియోజకవర్గం సమస్యల గురించి తెలియపరచడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు యశీదవ నారాయణరావు. పావులు. మురళి. తదితరులు పాల్గొన్నారు.

# మొహారం పర్వదినం - త్యాగం, ధర్మం, మానవత్వానికి ప్రతీక



**తిరువూరు,జూన్ 26 (వార్తాప్రభ) :** మొహరం ఇస్లామిక్ నూతన సంవత్సరం లో తొలి నెల. ఈ నెలలోని పదవ రోజును "ఆషూరా"గా అత్యంత భక్తిశ్రద్ధలతో ఆచరిస్తారు. మొహరం కేవలం ఒక పండుగ మాత్రమే కాదు; ఇది త్యాగం, ధర్మం, న్యాయం, మానవత్వం కోసం చేసిన మహోన్నత పోరాటాన్ని స్మరించుకునే పవిత్ర సందర్భం.మొహరం సందర్భంగా ప్రవక్త మహ్మద్ మనవడు హజ్రత్ ఇమామ్ హుసైన్ త్యాగాన్ని ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు స్మరించుకుంటారు. కర్బలా యుద్ధంలో అన్యాయానికి తలవంచకుండా, సత్యం మరియు న్యాయం కోసం ఆయన చేసిన త్యాగం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయింది. అందుకే మొహరం మనకు ధైర్యం, నిజాయితీ, న్యాయబద్ధత వంటి విలువలను గుర్తుచేస్తుంది.ఈ సందర్భంగా ప్రార్థనలు, ధార్మిక సమావేశాలు నిర్వహిస్తారు. పేదలకు ఆహారం, నీరు పంపిణీ చేయడం, సేవా కార్యక్రమాలు చేపట్టడం ద్వారా మానవత్వానికి ప్రాధాన్యం ఇస్తారు. అనేక ప్రాంతాల్లో తాజియాల ఊరేగింపులు నిర్వహిస్తూ కర్బలా వీరుల త్యాగాన్ని గౌరవిస్తారు.మొహరం మనకు ఒక గొప్ప సందేశాన్ని అందిస్తుంది--- సత్యం కోసం నిలబడాలి, అన్యాయాన్ని ఎదిరించాలి, ప్రేమ, శాంతి, సోదరభావంతో సమాజాన్ని ముందుకు నడిపించాలి. మతాలకు అతీతంగా ప్రతి మనిషి ఈ విలువలను జీవితంలో ఆచరిస్తే సమాజంలో సామరస్యం, శాంతి మరింత బలపడతాయి. మొహరం పర్వదిన శుభాకాంక్షలు. త్యాగం, శాంతి, సౌభ్రాతృత్వం మన జీవితాల్లో చిరస్థాయిగా నిలవాలని ఆకాంక్షిద్దాం. రిపోర్టర్ గోపి ఏపీ ఎం పి ఏ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షుడు

# చెన్నూరు లో రిటైర్డ్ ఆర్మీ యువకుని పై దాడి...



**చెన్నూరు,జూన్ 26 (వార్తాప్రభ) :** పెడన మండలం చెన్నూరు గ్రామంలో శుక్రవారం నాడు రిటైర్డ్ అర్మీ పై దాడి జరిగినట్టు సమాచారం.గ్రామానికి చెందిన యువకుల మధ్య గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో చిన్నం రంగబాబు పై దాడి జరిగింది.బాధితుడు బందరు ప్రభుత్వ ఆసుపత్రి లో చికిత్స పొందుతున్నాడు.

